
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
బుధవారం 16 అక్టోబరు 2024



కాంట్రాక్ట్ డాక్టర్ పోస్టులకు 19న ఇంటర్వ్యూలు

గచ్చిబౌలి, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాలోని డిస్ట్రిక్ట్ హాస్పిటల్స్‌లో కాంట్రాక్ట్ పద్ధతిన వైద్య సేవలు అందించడానికి ఈనెల 19వ తేదీన కొండాపూర్ ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ హాస్పిటల్స్ సర్వీసెస్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తెలిపారు. జిల్లా ఆస్పత్రుల్లో మొత్తం 20 పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్ని రకాల స్పెషలిస్ట్ డాక్టర్లు తెలంగాణ వైద్యవిధాన పరిషత్ కింద పనిచేయాల్సి ఉంటుందన్నారు. వారికి నెలకు రూ.లక్ష వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల, అర్హులైన వైద్యులు తమ ఒర్జినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కేపీవీ రాజు

జల్సాల కోసం దొంగతనాలు

- ఇద్దరు యువకుల అరెస్ట్
- కేసును ఛేదించిన గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు
- నిందితులు సూర్యాపేట జిల్లా వాసులు

8

అవకతవకలపై విచారణ
చేపట్టండి

- సిద్దాపూర్ అసైన్డ్ భూసేకరణలో మోసం
- విజిలెన్స్ కమిషనర్‌కు ఎమ్మెల్యే శంకర్ ఫిర్యాదు



కొత్తూర్, అక్టోబర్ 15: మండల పరిధిలోని సిద్దాపూర్ గ్రామంలోని అసైన్డ్ భూసేకరణలో జరిగిన అవతవకలపై విచారణ చేయించాలని కోరుతూ షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హైదరాబాద్‌లోని విజిలెన్స్ కమిషనర్ ఎంజీ గోపాల్‌కు మంగళవారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. సిద్దాపూర్ గ్రామంలో ఇండస్ట్రియల్ పార్కు కోసం టీఎస్ఐఐసీకి అప్పగించించిన మొత్తం 230 ఎకరాల్లో 140 ఎకరాలు అసైన్డ్ భూమి కాగా, మిగతా భూమి ప్రభుత్వానిదని పేర్కొన్నారు. గత ప్రభుత్వం 250 మంది రైతుల నుంచి 240 ఎకరాల భూమిని సేకరించినట్లుగా తప్పుడు లెక్కలు చూపించి పరిహారం తీసుకున్నారన్నారు. 80 మంది వ్యక్తులు భూ రికార్డుల్లో వారి పేర్లు లేకున్నా.. పరిహారం పొందారని వివరించారు. ఈ విషయమై సమగ్ర విచారణ చేసి అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటు శంకుస్థాపన కార్యక్రమంలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, బండి సంజయ్, అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎంపీలు, ఎమ్మెల్యేలు

కలిసి పనిచేస్తాం

దేశ రక్షణ విషయంలో రాజకీయాలు చేయం

- సిద్ధాంతాలు వేరైనా అన్ని పార్టీలతో కలిసి వెళ్తాం
- పర్యావరణానికి హాని అనేది పూర్తి అవాస్తవం
- గిట్టనివారు చేసే ఆరోపణలను పట్టించుకోవద్దు
- ఇక్కడ ప్రాజెక్టు ఏర్పాటు స్థానిక ప్రజలకు గర్వకారణం
- ప్రపంచపటంలో వికారాబాద్ జిల్లాకు ప్రత్యేక గుర్తింపు
- నేవీ రాడార్ స్టేషన్ శంకుస్థాపనలో సీఎం రేవంత్‌రెడ్డి
- హాజరైన కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, బండి సంజయ్, అసెంబ్లీ స్పీకర్, ఎంపీలు, ఎమ్మెల్యేలు



మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

రంగారెడ్డి అర్బన్/పరిగి/పూడూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ విషయంలో రాజకీయాలు చేయమని అందరం కలిసి పని చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఎన్నికలప్పుడే పార్టీలు రాజకీయాలు చేయాలని, దేశ రక్షణ విషయంలో అందరు కలిసి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం దామగుండలో మంగళవారం వీఎల్ఎఫ్(వెరీ లో ఫ్రీక్వెన్సీ) నేవీ రాడార్ స్టేషన్ నిర్మాణానికి నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు ఇక్కడ ఏర్పాటు చేయడం జిల్లా

మిగతా 7వ పేజీలో...

సరసస్వర సుర..

తెలుగు సంగీతానికి చిన్నారుల స్వరసేవ

- యూట్యూబ్ చానల్‌తో ప్రత్యేక గుర్తింపు
- రెండేళ్లలో 1.74 లక్షల సబ్‌స్క్రైబర్లు
- ప్రజల మన్ననలు పొందుతున్న నిఖిత, రుచిత



సంగీతంపై రీల్స్ చేస్తున్న చిన్నారులు నిఖిత, రుచిత

ప్రస్తుతం సమాజాన్ని ప్రభావితం చేయడంలో సోషల్ మీడియా పాత్ర కీలకంగా మారింది. ప్రజా సంబంధాలు, సమాజంపై అవగాహన ఉన్న ఏ వ్యక్తి నోటా విన్నా ఓ యూట్యూబ్ చానల్ ప్రయత్నం చేయరాదా? అని చెబుతుంటారు. ఆ దిశగా చిన్న, పెద్ద అనే తేడా లేకుండా రీల్స్ చేసి అప్‌లోడ్ చేయడం సాధారణమైంది. యూట్యూబ్ చానల్ క్రియేట్ చేసి వారు అప్‌లోడ్ చేసి రీల్స్‌తో సమాజాన్ని ప్రభావితం చేసే స్థాయికి చేరుకుంటున్నారు. లక్షల సబ్‌స్క్రైబర్స్, కోట్లల్లో వ్యూవర్స్‌తో దూసుకపోతున్నారు. వారి వివరాలతో ప్రత్యేక కథనం.

7

సబ్ రిజిస్ట్రార్ల బదిలీ



రంగారెడ్డి అర్బన్, అక్టోబర్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పలువురు సబ్ రిజిస్ట్రార్లకు ప్రభుత్వం స్థానచలనం కల్పించింది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలోని కొంత మంది గ్రేడ్-1, గ్రేడ్ -2 సబ్ రిజిస్ట్రార్లను బదిలీ చేస్తూ ఈ మేరకు జీవో జారీ చేసింది. వివరాలిలా ఉన్నాయి.

సబ్‌రిజిస్ట్రార్(ఎస్ఆర్)	ప్రస్తుతం	పోస్టింగ్
బి. రాజశేఖర్‌రెడ్డి	ఎస్ఆర్, శేరిలింగంపల్లి	సబ్ రిజిస్ట్రార్, ఎంవీ అండ్ ఏ- రంగారెడ్డి
కె. మహేందర్	ఎస్ఆర్, గండిపేట్	వికారాబాద్
జి. జగన్మోహన్‌రాజు	ఎస్ఆర్, సరూర్‌నగర్	అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, గోల్కొండ
మధుసూదన్‌రెడ్డి	ఎస్ఆర్, పరిగి	జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-2, ఆర్వో(ఓబీ), రంగారెడ్డి
సతీశ్	ఎస్ఆర్, ఉప్పల్	సబ్ రిజిస్ట్రార్, ఎంవీ, అండ్ ఏ, మేడ్చల్
జె. సురేందర్	కుత్బుల్లాపూర్	జాయిట్ సబ్‌రిజిస్ట్రార్-1, ఆర్‌వో(ఓబీ), పటాన్‌చెరు
బి. శ్రీనివాస్	జాయింట్ సబ్ రిజిస్ట్రార్-2	సబ్‌రిజిస్ట్రార్- పరిగి
వోడీ బేసెస్‌లో..		
ఎండీ అసిఫోద్దీన్	సబ్ రిజిస్ట్రార్- కరీంనగర్	సబ్‌రిజిస్ట్రార్, శేరిలింగంపల్లి
ఎం. శ్రీలత	సబ్ రిజిస్ట్రార్- మెదక్	సబ్‌రిజిస్ట్రార్, సరూర్‌నగర్
మోసెస్ భాస్కర్	సబ్ రిజిస్ట్రార్-సత్తుపల్లి	సబ్ రిజిస్ట్రార్, ఉప్పల్

పైప్‌లైన్ గుంతలు
పూడ్చరేం?

రోడ్డు వెంట ప్రమాదకరంగా మట్టి కుప్పలు

- పట్టించుకోని సంబంధిత అధికారులు
- ప్రమాదాల బారిన వాహనదారులు

8





గ్రామ శివారులో కృష్ణా జలాలకు స్వాగతం పలుకుతున్న రైతులు

పోలెపల్లికి కృష్ణా జలాలు

కేఎల్ఐ డీ-82 కాల్వ ద్వారా నీరు విడుదల

- సాకారమైన ఏడేళ్ల కల
- ఆనందంలో రైతులు, గ్రామస్తులు

ఆమనగల్లు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మండలం పోలెపల్లి , సింగంపల్లి గ్రామాల రైతుల దశాబ్దాల కల సాకారమైంది. కేఎల్ఐ డీ- 82 కాల్వ ద్వారా మంగళవారం పోలెపల్లి శివారులోకి కృష్ణా జలాలు ప్రవేశించాయి. దీంతో ఏళ్లుగా నీటి కోసం ఎదురు చూసిన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా నీరు గ్రామ శివారులోకి వస్తుందన్న సమాచారంతో రైతులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో కాల్వ వద్దకు చేరుకొని గంగమ్మను స్వాగతించారు. అసంపూర్తి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించి సాగునీరు విడుదల చేయించిన సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిలకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఆమనగల్లు మండలంలో రెండు చోట్ల చిన్న చిన్న పనులను పూర్తి చేస్తే కృష్ణాజలాలు మాడ్గుల మండలానికి చేరుతాయి.

2017 ఫిబ్రవరిలో కాల్వ నిర్మాణం

కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా వెల్దండ, ఆమనగల్లు, మాడ్గుల మండలాల పరిధిలోని 37,500 ఎకరాలకు సాగు నీరందించడానికి డీ-82 కాల్వ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2017లో రూ.178 కోట్లు విడుదల చేసింది. దీంతో కల్వకుర్తి మండలం జంగారెడ్డిపల్లి నుంచి మాడ్గుల మండలం నాగిళ్ల వరకు కాల్వ నిర్మాణం చేపట్టారు. ఆమనగల్లు మండలంలో ని పోలెపల్లి, సింగంపల్లి గ్రామాల పరిధిలో సుమారు 8 కిలోమీటర్ల మేర రైతుల పట్టా భూముల్లో ఈ కాల్వ నిర్మాణం చేశారు. మాడ్గుల మండంలో అవురుపల్లి, దొడ్లపహాడ్, అప్పారెడ్డిపల్లి, నాగిళ్ల నాలుగు గ్రామాల పరిధిలో కూడా 70 మంది రైతులకు చెందిన 106 ఎకరాల్లోనూ కాల్వ నిర్మాణం చేపట్టారు.

డీఎస్సీ కౌన్సెలింగ్ పూర్తి

- 379 ఖాళీలకు 333 పోస్టులు భర్తీ
- పోస్టింగ్ ఆర్డర్స్ అందుకున్న అభ్యర్థులు
- నేడు జాయిన్ కానున్న కొత్త టీచర్లు



కలెక్టరేట్‌లో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు హాజరైన డీఎస్సీ అభ్యర్థులు

రంగారెడ్డి అర్బన్, అక్టోబర్ 15(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ పోస్టింగ్ విషయంలో నెలకొన్న గందరగోళానికి తెరపడింది. సాంకేతిక సమస్యలతో కౌన్సెలింగ్ వాయిదా వేస్తున్నట్టు మంగళవారం ఉదయం అధికారులు ప్రకటించారు. అయితే కాసేపటికే మళ్లీ అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు రావాలని అధికారులు ఫోన్లు చేసి చెప్పారు. వెంటనే వారికి కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్ ఆర్డర్లు అందజేశారు. మొన్న సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్న వారంతా పోస్టింగ్ ఆర్డర్స్ తీసుకునేందుకు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. కొంగర కలాన్‌లోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి చేరుకొని ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత పోస్టింగ్ ఆర్డర్స్ అందుకున్నారు. వారికి వచ్చిన మార్కులు, ర్యాంకులు ఆధారంగా వారికి స్కూళ్లను కేటాయించారు. వాటి ఆధారంగానే పోస్టింగ్ ఆర్డర్స్ జారీ చేశారు.

పీఈటీ ఆరు పోస్టులకు..

జిల్లాలో మొత్తం 379 పోస్టులు ఖాళీలు ఉండగా 333 మంది అభ్యర్థులకు పోస్టింగ్ అర్డర్లను అందజేశారు. పోస్టింగ్ ఆర్డర్స్ జారీలో స్కూల్ అసిస్టెంట్‌కు సంబంధించి 61 పోస్టులు ఖాళీ ఉండగా 58 మంది అభ్యర్థులకు పోస్టింగ్ ఇచ్చారు. లాంగ్వేజ్ పండిట్ 30 పోస్టులకు గాను 28 మందికి అభ్యర్థులకు పోస్టింగ్ ఇచ్చారు. అలాగే ఆరు పీఈటీ పోస్టులు ఖాళీ ఉండగా ఆరు పోస్టుల భర్తీకి పోస్టింగ్ ఆర్డర్స్ ఇచ్చారు. 226 ఎస్జీటీ పోస్టులు ఖాళీ ఉండగా 207 మంది అభ్యర్థులకు పోస్టింగ్ ఆర్డర్లను అందజేశారు. ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించి 46 పోస్టులు ఖాళీ ఉండగా 34 మంది అభ్యర్థులకు పోస్టింగ్ ఆర్డర్లను అందజేశారు. పోస్టింగ్ ఆర్డర్స్ అందుకున్న వారంతా నేడు ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరనున్నారు.

యాచారంలో భారీ వర్షం

యాచారం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : యాచారం మండల కేంద్రంతో పాటు నందివనపర్తి, చౌదర్‌పల్లి, చిన్నతూండ్ల, గున్‌గల్, మల్కీజ్‌గూడ, నజ్దిక్‌సింగారం, తమ్మలోనిగూడ తదితర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆకాశంలో దట్టమైన మేఘాలు కమ్ముకోవడంతో గంట పాటు భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీంతో వాహనాదారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కాగా, ఈ వర్షం కారణంగా పత్తి పంట పాడవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



యాచారంలో కురుస్తున్న వర్షం

ఇద్దరి అరెస్టు

కిడ్నాప్ కేసు ఛేదించిన పోలీసులు

కడ్తాల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మైనింగ్ వ్యాపారి, రియల్టర్ పీట్ల కతాల్‌పై జరిగిన దాడి కేసులో ఇద్దరు నిందితులను మంగళవారం అరెస్టు చేసినట్లు కడ్తాల్ సీఐ శివప్రసాద్ తెలిపారు. వనపర్తి జిల్లా పానగల్లు మండలం రేమద్దుల గ్రామానికి చెందిన కతాల్ హైదరాబాద్‌లో నివాసముంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. కాగా, ఈ నెల 5న కతాల్ తనపై ఉన్న కేసు విషయమై వెల్దండ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి హైదరాబాద్ వస్తుండగా కడ్తాల్ టోల్ ప్లాజా వద్ద బద్రి అఫ్రోజ్, సురేష్, కొండల్‌లు కతాల్ కారుపై రాళ్లతో దాడి చేశారు. ఆ వెంటనే కారులో నుంచి బయటకు లాగి విచక్షణారహితంగా దాడి చేసి తమ వెంట తీసుకువచ్చిన షిఫ్ట్‌కారులో కిడ్నాప్ చేసి తీసుకెళ్లి వెల్దండ యన్నం ఆసుపత్రి సమీపంలో వదిలేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం పోతేపల్లికి చెందిన సంజీవ్‌కుమార్ ప్రోద్బలంతో తన తండ్రి కతాల్‌పై దాడి చేశారని ఆయన కుమారుడు శ్యాంకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బద్రి నిజాముద్దీన్, అఫ్రోజ్, సురేశ్‌లను అరెస్టు చేయగా సంజీవ్ కుమార్, బర్కత్‌పల్లికి చెందిన కోడెల కొండల్‌ను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. పీట్లకతాల్, వావిల్ల సంజీవ్‌యాదవ్ మధ్యం వ్యాపార లావాదేవీలే దాడి, కిడ్నాప్‌కు కారణమని ఆయన తెలిపారు.

ఓటు నమోదుకు చొరవ చూపాలి

అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 18 ఏళ్ల నిండిన యువత కొత్తగా ఓటు నమోదు చేసుకునేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు కృషి చేయాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో డీఆర్వో హరిప్రియతో కలిసి ఆయన వివిధ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 18 ఏళ్ల నిండిన యువత ఎక్కువ శాతం ఉన్నప్పటికీ ఓటరు నమోదు శాతం పెరగడం లేదని, వార్డుమెంబర్ల భాగస్వామ్యంతో యువత కొత్తగా ఓటు నమోదు చేసుకునేలా చొరవతీకోవాలని పార్టీల ప్రతినిధులను కోరారు. ఎన్నికల కమిషన్ సూచన మేరకు జిల్లాలో ఓటర్లకు అనుకూలంగా ఉండేలా 1500 మందికి ఒక పోలింగ్ బూత్ ప్రకారం.. అదనంగా 38 బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో 21, మల్కాజిగిరిలో 7, కుత్బుల్లాపూర్‌లో 10 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఈ మార్పుపై ఓటర్లకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ సూచించారు. కీసర ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ రాజేశ్వర్‌రెడ్డి, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

ప్రసన్నకు ప్రశంసలు

ఇండో-థాయ్‌లాండ్ త్రోబాల్ సిరీస్‌లో గోల్డ్‌మెడల్ సాధించిన విద్యార్థిని

మేడ్చల్ టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : ఇండో-థాయ్‌లాండ్ త్రోబాల్ సిరీస్-2024 టోర్నమెంట్(వుమెన్)లో భారత్ తరఫున పాల్గొని గోల్డ్‌మెడల్ సాధించిన కె.ప్రసన్నను మంగళవారం సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో యాజమాన్యం ఘనంగా సన్మానించింది. సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ చదువుతున్న ప్రసన్న ఇటీవల థాయ్‌లాండ్‌లో నిర్వహించిన టోర్నమెంట్‌లో పాల్గొని గోల్డ్‌మెడల్ సాధించింది. ఈమేరకు ఆమెకు కళాశాల వైస్‌ఛైర్మన్ సి.భూపాల్‌రెడ్డి, కార్యదర్శి శ్రీశైలం రెడ్డిలు జ్ఞాపిక అందజేసి సన్మానించారు. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీల్లో తమ కళాశాలకు చెందిన విద్యార్థిని పాల్గొని త్రోబాల్ విభాగంలో ప్రతిభ కనపరచటం అభినందనీయమని భూపాల్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులతో పాటు విద్యార్థులు ప్రసన్నను అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.శ్రీనివాసులురెడ్డి, సీఎస్ఈ విభాగం హెడ్ డాక్టర్ కుమారస్వామి, పీడీ రాజేష్‌గౌడ్, డీన్, కేవీ రెడ్డిలు పాల్గొన్నారు.



ప్రసన్నను సన్మానిస్తున్న సీఎంఆర్ కళాశాల యాజమాన్యం

వికారాబాద్ వాసికి పీహెచ్‌డీ పట్టా



పీహెచ్‌డీ డిగ్రీ అందుకుంటున్న డాక్టర్ చందన

వికారాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా మహాత్మాజ్యోతిబా పూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో రాజకీయ శాస్త్రంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న వికారాబాద్ ప్రాంతానికి చెందిన డాక్టర్ ఏ.చందన ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పీహెచ్‌డీ పట్టాను పొందారు. 'రాష్ట్రంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉపాధి సృష్టి, గ్రామీణ అభివృద్ధి వైపు ఒక మైలు రాయి' అనే విషయంలో రంగారెడ్డి జిల్లాలోని అంశాలపై కేస్ స్టడీ రూపంలో చేసిన పరిశోధన విజయవంతంగా పూర్తి చేసినందుకు గానూ ఆమె పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు.

ఎంపీ బలరామ్ నాయక్‌ను కలిసిన కేశవులు



బలరామ్ నాయక్‌తో గుర్రం కేశవులు

ఆమనగల్లు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ ఎంపీ బలరామ్ నాయక్‌ను మంగళవారం ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుర్రం కేశవులు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలతో సత్కరించి అభినందించారు. కల్వకుర్తి నియోజకవర్గంలో గిరిజన తండాలు ఎక్కువగా ఉన్నందున వాటి అభివృద్ధికి ప్రభుత్వ పరంగా సహకారం అందేలా చూడాలని ఎంపీని కోరినట్లు పేర్కొన్నారు. ఈమేరకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు కేశవులు తెలిపారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు బికుమాండ్ల రమేశ్ తదితరులు ఉన్నారు.

చౌదర్‌పల్లివాసికి మెడికల్ సీటు



అవినాశ్

ఆమనగల్లు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): చౌదర్‌పల్లి గ్రామానికిచెందిన కావటి వెంకటయ్య స్వప్నల కుమారుడు అవినాశ్ నల్గొండ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించాడు. ఈ ఏడాది నీట్‌లో ఆల్ ఇండియా స్థాయిలో 1,24,493 ర్యాంక్, రాష్ట్రస్థాయిలో 1801 ర్యాంక్ సాధించాడు. దాంతో మెడికల్ కళాశాలలో సీటు లభించింది. నిరుపేద కుటుంబంలో పుట్టిన కావటి వెంకటయ్య డ్రైవర్‌గా పనిచేస్తూ అవినాశ్‌ను చదివించాడు.

సర్దార్‌నగర్‌లో స్ట్రీట్‌లైట్లను ప్రారంభించాలి



వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

మహేశ్వరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తుక్కుగూడ మున్సిపల్ కేంద్ర నుంచి సర్దార్‌నగర్ వరకు స్ట్రీట్‌లైట్లను ప్రారంభించాలని సర్దార్‌నగర్ గ్రామస్తులు మున్సిపల్ చైర్‌పర్సన్ హేమలతా రాజుగౌడ్‌ను ఆమె చాంబర్‌లో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ స్ట్రీట్‌లైట్లు ఏర్పాటు చేసి సంవత్సరం కావస్తున్నా.. ఎందుకు ప్రారంభించలేదో అధికారులను అడిగి తెలుసుకుంటాన న్నారు. రచ్చ లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

సరసస్వర సుర..

- తెలుగు సంగీతానికి చిన్నారుల స్వరసేవ
- యూట్యూబ్ చానల్‌తో ప్రత్యేక గుర్తింపు
- రెండేళ్లలో 1.74 లక్షల సబ్‌స్క్రైబర్లు
- ప్రజల మన్ననలు పొందుతున్న నిఖిత, రుచిత

పరిగి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సంగీతంపై ఉన్న మక్కువతో ఓ తండ్రి తన ఇద్దరు కూతుళ్లను ప్రోత్సహించడంతో వారు పలువురి మన్ననలు పొందేలా చేస్తున్నాడు. ఆ చిన్నారులిద్దరూ సంగీతం సమకూర్చుతూ భక్తి, ఆధ్యాత్మిక పాటలతో అలరిస్తూ తమ ప్రతిభ నలుగురికీ తెలిసేలా రీల్స్‌చేసి ఓ యూట్యూబ్ ఛానల్ నడుపుతున్నారు. పరిగి పట్టణానికి చెందిన ఇద్దరు చిన్నారులు చేసిన చిరు ప్రయత్నంతో నేటికి 1.70 లక్షల సబ్‌స్క్రైబర్లు ఉన్న యూట్యూబ్ ఛానల్ నడుస్తోంది. గద్వాల జిల్లా ఉండవల్లి మండలం ప్రాగటూరు గ్రామానికి చెందిన దేశం మల్లేశం కొన్నేళ్ల క్రితం ఉపాధి కోసం పరిగి పట్టణానికి వచ్చాడు. పరిగిలో జ్యూస్ సెంటర్ నడుపుతున్నాడు. మల్లేశానికి ఇద్దరు కూతుళ్లు నిఖిత, రుచిత. పరిగిలోని ఓ ప్రైవేట్ స్కూల్లో నిఖిత ఎనిమిది, రుచిత ఏడో తరగతి చదువుతున్నారు.



హార్మోనియంతో నిఖిత, రుచిత (ఫైల్)

కాగా, మల్లేశంకు సంగీతంపై ఆసక్తి ఎక్కువ. హార్మోనియం వాయించడం అలవాటు. దాంతో కూతుళ్లకు కూడా నేర్పించాడు.

తండ్రి ప్రోత్సాహంతో..



శివరాత్రి ఉత్సవాల్లో.. (ఫైల్)

నిఖిత, రుచితలు తమ ప్రతిభను అందరికీ చూపించాలని రెండేళ్ల క్రితం తెలుగు సంగీత స్వరం పేరుతో యూట్యూబ్ ఛానల్‌ని ప్రారంభించారు. రెండేళ్లలోపే సబ్‌స్క్రైబర్ల సంఖ్య 1.74 లక్షలకు చేరింది. కాగా, వారు ఇప్పటి వరకు 697 రీల్స్‌ను తమ చానల్‌లో అప్‌లోడ్ చేశారు. శివుడిపై చేసిన ఓ పాటను 26 లక్షలు, రావోయి చందమామకు 41 లక్షల మంది వ్యూవర్స్ చూశారు. తెలుగు సంగీత స్వరం చానల్‌తో పాటు ఆ చిన్నారులు తండ్రి మల్లేశంతో కలిసి వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో నిర్వహించే సంగీత, సాహిత్య కార్యక్రమాలకూ వెళ్తుంటారు. అయితే, నాన్న మల్లేశం ప్రోత్సాహంతోనే సంగీతంపై రీల్స్‌చేసి ఛానల్‌ను నడుతున్నామని చిన్నారులు చెబుతున్నారు. తమ ఛానల్ ద్వారా అంతరించిపోతున్న సంగీతం, నాట్యకళలు బతికే ఉన్నాయని చెప్పడానికి చిరు ప్రయత్నం చేస్తున్నామని చెబుతున్నారు. తమకు కావాల్సిన ప్రోత్సాహం లభిస్తే ఇంకా ముందుకు వెళతామని వారు 'ఆంధ్రజ్యోతి'తో తెలిపారు.

కలిసి పనిచేస్తాం

(5వ పేజీ తరువాయి)

ప్రజలకు గర్వకారణమన్నారు. దేశంలోనే రెండో రాడార్ స్టేషన్ దామగుండంలో ఏర్పాటు కావడం చరిత్రాత్మకమన్నారు.

అడ్డుకునే ప్రయత్నం వద్దు

నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటుతో ప్రపంచ పటంలో వికారాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు రానుందన్నారు. ఇంతటి మహత్తర కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే ఇక్కడ దామగుండం శివుడే వారికి తెలివిని ప్రసాదిస్తాడని అన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల పర్యావరణానికి ఎలాంటి హాని ఉండదన్నారు. లక్షల చెట్లు తీసేదేమీ లేదని, అబద్ధాలు చెప్పే వారి మాటలు నమ్మొద్దన్నారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటు విషయంలో తాను నిలబడి పని చేయిస్తామన్నారు. దామగుండంలో ప్రజలు విశ్వసించే పవిత్ర దేవాలయం ఉందని అక్కడికి ప్రజలు వెళ్లేందుకు దారి ఏర్పాటు చేసి వచ్చి పోయేందుకు సౌకర్యం కల్పించాలని కోరారు. ఇక్కడ పిల్లలు చదువుకునేందుకు ప్రత్యేక విద్యాసంస్థల ద్వారా అవకాశం కల్పించాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ సంపూర్ణ మద్దతు

రాజకీయాల్లో సైద్ధాంతిక వైరుధ్యాలు ఉండొచ్చు.. కానీ దేశ భద్రతకు సంబంధించిన అంశాల్లో కొందరు



రాజ్‌నాథ్‌సింగ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న నేవీ అధికారులు, పక్కన సీఎం రేవంత్, ఎంపీ సంజయ్

అపోహలు సృష్టించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటు నిర్ణయాలన్నీ గత ప్రభుత్వ హయాంలోనే జరిగాయన్నారు. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అడిగిన వెంటనే తాము కార్యాచరణను ముందుకు తీసుకెళ్లామన్నారు. ప్రాజెక్టు పూర్తయ్యేందుకు తెలంగాణ ప్రభుత్వం నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, కేంద్ర మంత్రి బండి సంజయ్, భారత నావికాదళం ప్రధానాధికారి దినేశ్, ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డీకే అరుణ, ఎమ్మెల్సీ, ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, కాలె యాదయ్య, నేవీ అధికారులు రాజేశ్ బండారు, మల్లికార్జునరావు, కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్లు ఉమాహారతి, లింగ్యానాయక్, ఆర్డీవో వాసుచంద్ర, పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్లు మంజుల, స్వప్నపరిమల్, నాయకులు రమేశ్, సుధాకర్‌రెడ్డి, సత్యనారాయణ, కిషన్ నాయక్, లాల్ కృష్ణప్రసాద్, రఘునాథ్‌రెడ్డి, సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుష్ప్రచారాన్ని నమ్మొద్దు: రామ్మోహన్‌రెడ్డి



నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటుపై గిట్టనివారు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కోరారు. శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దామగుండం అడవులు దేశంలోనే పవిత్రమైనవన్నారు. మన ప్రాంతంలో ఈ ప్రత్యేకమైన దేశ రక్షణకు సంబంధించిన సెంటర్‌ను ఏర్పాటు చేయడం జిల్లా ప్రజలు గర్వించాల్సిన విషయమన్నారు. 2014లోనే తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే పూడూరులో ప్రజాభిప్రాయ సేకరణ జరిగిందన్నారు. అందరి ఆమోదంతోనే ముందుకు కొనసాగిందన్నారు. సెల్‌ఫోన్ రేడియేషన్ కంటే నేవీ రాడార్ స్టేషన్‌లో చాలా తక్కువ రేడియేషన్ ఉంటుందన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. ఈ సెంటర్ పరిధిలోనే అంతర్జాతీయ ప్రమాణాలతో స్కూల్, ఆస్పత్రులు ఏర్పాటు అవుతాయన్నారు. అందులో స్థానికులకు 15 శాతం అధిక అవకాశాలు ఉంటాయన్నారు.



శామీర్‌పేట: సమావేశంలో మాట్లాడుతున్న వజ్రేష్‌యాదవ్

రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ కమిటీలు

శామీర్‌పేట/ఘట్‌కేసర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో చేపడుతున్న ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ కమిటీలను వేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. శామీర్‌పేట మండలం తూంకుంటలోని మొగుళ్ల వెంకట్‌రెడ్డి ఫంక్షన్‌హాల్లో మంగళవారం తూంకుంట మున్సిపల్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, శామీర్‌పేట మండలాధ్యక్షుడు వైఎస్ గౌడ్ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుకై శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల, తూంకుంట మున్సిపల్, జవహర్‌నగర్ కార్పొరేషన్ పార్టీ ముఖ్యనాయకులతో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ గైడ్‌లైన్స్ ప్రకారం ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులకు, కాంగ్రెస్ ముఖ్యనాయకులకు ప్రాధాన్యమిస్తూ ఇందిరమ్మ కమిటీలను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్, ముజీబ్, బాలేష్, తదితరులున్నారు. అలాగే పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలోని ఎస్‌బీఆర్ గార్డెన్‌లో జరిగిన ఉమ్మడి ఘట్‌కేసర్ మండల ఇందిరమ్మ కమిటీల సన్నాహక సమావేశంలో తోటకూర వజ్రేష్ యాదవ్ పాల్గొని మాట్లాడారు. ఒకట్రెండు రోజుల్లో ఇందిరమ్మ కమిటీల నియామకాన్ని పూర్తిచేయాలని, కమిటీల్లో ఐదుగురు పార్టీ నాయకులు, ఒకరు స్థానిక ప్రజాప్రతినిధి ఉండేలా చూడాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, మేయర్లు అజయ్ యాదవ్, అమర్‌సింగ్, ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ పావనీ జంగయ్య యాదవ్ పాల్గొన్నారు.

వైభవంగా మైబుసుభానీ దర్గా ఉర్సు



దర్గా వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న భక్తులు

తాండూరు రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలం లోని చంద్రవంచలో మహబూబ్ సుభాని దర్గా ఉర్సును మంగళవారం వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని మసీదు నుంచి గంధం, జెండాలతో బ్యాండు మేళాల మధ్య ఊరేగింపుగా తీసుకొచ్చారు. దర్గా వద్దకు చేరుకుని పూలు, గంధం పువ్వులు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కులమతాలకతీతంగా గ్రామస్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. గ్రామ పెద్దలు సుదర్శన్‌రెడ్డి, రవిశంకర్ పటేల్ పాల్గొన్నారు.

విద్యుత్ ఏడీఈగా బాలకృష్ణ

ఆమనగల్లు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ ఆమనగల్లు ఏడీఈగా బాలకృష్ణ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. నాగర్‌కర్నూల్ నుంచి ఆయన బదిలీపై ఆమనగల్లుకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాస్ తుర్కయంజాల్‌కు బదిలీ అయ్యారు. ఈమేరకు డీఈ కార్యాలయంలో బాలకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి, మెరుగైన కరెంటు సరఫరాకు వంతు కృషి చేస్తానని బాలకృష్ణ తెలిపారు.

ఘనంగా దుర్గామాత నిమజ్జనం

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎదులాబాద్ సిగ్మాయూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో దుర్గమాత నిమజ్జనం ఘనంగా జరిగింది. అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించి అర్చనలు, అభిషేకాలు చేశారు. అమ్మవారి శోభాయాత్రలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని నృత్యాలు చేశారు. మండప నిర్వాహకులు బింగి రాజేందర్‌గౌడ్, యుగేందర్‌గౌడ్‌లు పలువురు నాయకులకు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్, బోడుప్పల్ మేయర్ అజయ్‌యాదవ్, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, బీ-బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, విశ్వనాథం, ప్రవీణ్, వినోద్‌గౌడ్ పాల్గొన్నారు.



నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు



శామీర్‌పేటలోని అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, వివిధ పార్టీల నాయకులు, భక్తులు

వైభవంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం

శామీర్‌పేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం శామీర్‌పేటలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం, అమ్మవారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ నెల 14న వార్షికోత్సవాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం కల్యాణం సందర్భంగా త్రిశక్తి పీఠం శ్రీశక్త్యానందగిరి స్వామి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, వివిధ పార్టీల నాయకులు, చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలుయాదవ్, మాజీ జడ్పీటీసీ అనితా లాలయ్యలు పూజల్లో పాల్గొన్నారు. అంతకుముందు గౌడ సంఘం నాయకులు వారిని ఆలయ మర్యాదలతో సన్మానించారు. భక్తులకు అన్నదానం చేశారు.

అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలి



యువకులతో మాట్లాడుతున్న సీఐ శంకర్‌కుమార్

యాచారం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని సీఐ శంకర్‌కుమార్ అన్నారు. మంగళవారం రాత్రి యాచారం మండల కేంద్రంలోని సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా చిరువ్యాపారులతో మాట్లాడి ఇబ్బందులు తెలుసుకున్నారు. అక్కడున్న యువకులతో మాట్లాడారు. మండల కేంద్రంలో నెంబర్‌ప్లేట్ లేని వాహనాలు కనిపిస్తే తమ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని, రాత్రివేళ ఎవరైనా ఇంటికొచ్చి పిలిచినా.. తీయాలని కోరినా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని యువకులను కోరారు. సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్సైలు మధు, సత్యనారాయణ తదితరులున్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి



టీకాలు వేస్తున్న పశు వైద్య అధికారులు

కొడంగల్ రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులు విధిగా వేయించాలని డీవీహెచ్‌వో సదానందం అన్నారు. కొడంగల్ పశు వైద్యశాల ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ అధికారి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్‌ప్రశాంత్ ప్రారంభించారు. వచ్చే నెల 14వ తేదీవరకు రెండవ విడత గాలికుంటు వ్యాధినివారణ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాల్గొన్న కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి పశువైద్యశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ నోహా, పశువైద్యులు పరమేష్, జేవీవో వెంకటయ్య, వీఏ శేఖర్, సిబ్బంది ప్రసాద్, పకీరప్ప, గోపాల మిత్ర శివకుమార్ పాల్గొన్నారు.

పైప్‌లైన్ గుంతలు పూడ్చరేం?

- రోడ్డు పక్కన ప్రమాదభరితంగా మట్టి కుప్పలు
- తొలగించని అధికారులు
- ప్రమాదాల బారిన వాహనదారులు

చేవెళ్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యంతో రోడ్డు పక్కన మట్టి కుప్పలు వదిలేయడంతో వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. అయినా పట్టించుకునే నాథుడు లేడని వాహనదారులు, గ్రామస్తులు వాపోతులున్నారు. వివరాలిలా ఉన్నాయి. చేవెళ్ల మండలం కమ్మెటచౌరస్తా నుంచి శంకర్‌పల్లి మండలం ప్రొద్దటూర్‌కు మిషన్ భగీరథ అధికారులు నాలుగు నెలల క్రితం రోడ్డు వెంట కాలువ తీసి పైప్‌లైన్ వేశారు. ఇలా 5కిలోమీటర్ల మేర పైప్‌లైన్ కోసం తవ్వారు.


కమ్మెట-గొల్లగూడ రోడ్డు పక్కన పోసిన మట్టి కుప్ప

వచ్చిన మట్టిని రోడ్డు పక్కనే కుప్పలుగా పోశారు. అక్కడక్కడ పూడ్చినా రోడ్డు మలుపుల వద్ద కాలువ పూడ్చలేదు. రోడ్డుపైనే మట్టికుప్పలుండడంతో రాత్రిపూట వాహనదారులు మట్టి కుప్పలను ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రమాదభరితంగా ఉన్న గుంతలు పూడ్చి, మట్టికుప్పలు తొలగించాలని పలుమార్లు మిషన్ భగీరథ, ఆర్‌అండ్‌బీ అధికారులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదని కమ్మెట వాసులు, నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాగాఉన్న రోడ్డు వెంట పైప్‌లైన్ కోసం గుంతలు తీశారు. వాటిని పూడ్చేయించాల్సిన బాధ్యత అధికారులదే అయినా వారు పట్టించుకోవడం లేదు. మట్టి కుప్పలు రోడ్డుకు రెండు మూడు గజాల దూరంలో ఉన్నా ప్రమాదం ఉండేది కాదని, రోడ్డు పక్కనే మట్టిపోయడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మట్టికుప్పలు తొలగించి గుంతలను పూడ్చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇందిరమ్మ కమిటీలను పూర్తి చేయాలి


మాట్లాడుతున్న కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

మహేశ్వరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు అవసరమయ్యే ఇందిరమ్మ కమిటీలను అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో వెంటనే పూర్తిచేయాలని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం తుక్కుగూడలోని పార్టీ కార్యాలయంలో ముఖ్యనాయకులతో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశానుసారం ఇందిరమ్మ కమిటీలను వేసుకోవాలని, కమిటీలో అన్ని సామాజిక వర్గాలవారు ఉండేలా చూసుకోవాలన్నారు. ఇందిరమ్మ కమిటీల్లోని పేర్లను అధికారులు పరిశీలించిన అనంతరం కమిటీ విధివిధానాలను తెలియజేస్తారన్నారు. ముఖ్యమంత్రి ప్రత్యేక కృషితో మన నియోజకవర్గం అభివృద్ధిలో మహానగరంగా రూపుదిద్దుకోనుందని, త్వరలో మహేశ్వరం పేరు ప్రపంచ రికార్డుల్లో ఎక్కనుందన్నారు. ఇక్కడ యువతకు ఉద్యోగాలు లభిస్తాయని, అలాగే అభివృద్ధి ఫలాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి ఏర్పాటుకు నోటిఫికేషన్

చేవెళ్ల, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి):చేవెళ్లలోని బాలాజీవేంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి నియామకానికి ఎండోమెంట్ శాఖ మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసిందని ఆలయ ఈవో టి.నరేందర్ తెలిపారు. చేవెళ్లలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఎండోమెంట్ కమిషనర్ ఆలయ కమిటీ ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. ఆసక్తి ఉన్న వారు 20రోజుల్లో సహాయ కమిషనర్, దేవాదాయశాఖ, రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

'కులం పేరుతో దూషించిన వ్యక్తులను అరెస్టు చేయాలి'

చేవెళ్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దుషించిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలని మంగళవారం పలువురు డిమాండ్ చేశారు. చేవెళ్ల మండల పరిధి అల్లావాడ గ్రామంలో దసరా సందర్భంగా దుర్గమాత విగ్రహం ఏర్పాటు చేశారు. అయితే అమ్మవారి విగ్రహం దగ్గర పూజ చేసుకోవడానికి ఎస్సీ కులానికి చెందిన వెళ్లిన వారి పట్ల అక్కడ ఉన్న కొందరు అగ్రకులాల వారు పూజలు చేయడానికి వీల్వేదంటు దుర్భాషాలాడారని తెలిపారు. మహిళలు అమ్మవారి దగ్గర బతుకమ్మ ఆడుకోవడానికి వెళ్తే ఎస్సీలు మరోచోట ఆడుకోవాలని అన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కులం పేరుతో కించపరిచి ఎస్సీలను మనోవేదనకు గురి చేసిన వారిని పోలీసులు అరెస్టు చేసి అట్రాసిటీ కేసుపెట్టాలని భారతీయ నాస్తిక సమాజం జిల్లా అధ్యక్షుడు నాగాని ఆర్కె డిమాండ్ చేశారు.

అబ్దుల్ కలాం జీవితం
యువతకు మార్గదర్శకం


కడ్తాల్: అబ్దుల్‌కలాం విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, యాట నర్సింహ

కడ్తాల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవితం అందరికీ ఆదర్శప్రాయమని, ఆయన అనుసరించిన మార్గం యువతకు అనుసరణీయం అని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్ అన్నారు. దేశ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు అబ్దుల్ కలాం అని కొనియాడారు. భారతరత్న, శాస్త్రవేత్త అబ్దుల్ కలాం జయంతిని మంగళవారం కడ్తాలలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బిచ్యానాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కలాం విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, జహంగీర్ బాబ, రామకృష్ణ, మల్లేశ్‌గౌడ్, లక్పతి, మంకి శ్రీను,రాజేశ్, రవి, శ్రీకాంత్, రమేశ్, భానుకిరణ్, మహేశ్, సేవ్య పాల్గొన్నారు. అలాగే బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్ ఆధ్వర్యంలో కలాం జయంతిని నిర్వహించారు. సీనియర్ నాయకులు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, ఆనంద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చంద్రమౌళి, లాయక్‌అలీ, నర్సింహ, యాదయ్య, లింగప్ప, రాంచంద్రయ్య, పుల్లయ్య వెంకటేశ్, శ్రీకాంత్, రాజు పాల్గొన్నారు. కడ్తాల బటర్ ఫ్లై సిటీలో కలాం జయంతిని నిర్వహించారు. ఎండీ శేషగిరిరావు కలాం విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్కూల్ కో-ఫౌండర్ రమేశ్, ప్రిన్సిపాల్ సంజీవ్ నాంపల్లి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ రూరల్: అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని ఫరూఖ్‌నగర్ మండలం విఠ్యాల పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులందజేశారు. కలాం జీవనం, సాధించిన విజయాలను వివరించారు. హెచ్ఎం రవికుమార్, టీచర్లు పాల్గొన్నారు.


షాద్‌నగర్ రూరల్: పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


షాద్‌నగర్ అర్బన్: అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎన్.శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్ అర్బన్: భారత్‌ను బలమైన అణుశక్తి దేశంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్రవహించిన మిస్సైల్ మ్యాన్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కళాం యువతకు స్ఫూర్తి ప్రధాత అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, వివేకానంద విద్యా సంస్థల కరస్పాండెంట్ నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. షాద్‌నగర్‌లో గల వివేకానంద డిగ్రీ కళాశాలలో అబ్దుల్ కళాం జయంతిని పురష్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ అబ్దుల్ కలాం శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి సేవలందించారని తెలిపారు. ఆయనను ప్రతీ విద్యార్థి ఆదర్శంగా తీసుకొని ఉన్నత లక్ష్యాలతో కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు వాడకట్టు విజయ్‌కుమార్, కరుణాకర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

జల్సాల కోసం దొంగతనాలు

ఇద్దరు యువకుల అరెస్ట్ ● చోరీ కేసును ఛేదించిన గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు


దుండగులు నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు, కారు

యాచారం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జల్సాల కోసం చోరీలకు పాల్పడుతున్న దొంగలను హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, సీఐ లిక్కి కృష్ణంరాజు మంగళవారం వెల్లడించారు. సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడ మండలం రామన్నగూడెంకు చెందిన వుటుకూరు ప్రభాస్(20) అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పెద్దఅంబర్‌పేటలోని మైత్రీలహరి కాలనీలో ఉంటూ బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్నాడు. ఇతడికి నల్గొండ జిల్లా శాలిగౌరారానికి చెందిన గుండ్లపల్లి శివ (19) ఇన్‌స్టాలో పరిచయమయ్యాడు. డబ్బు కోసం వీరు దోపిడీలను ఎంచుకొని ఒంటరి వృద్ధులను, మహిళలను టార్గెట్ చేసుకున్నారు. ఆకులమైలారానికి చెందిన ఓ వ్యక్తి కారును అద్దెకు తీసుకొని దానిలో తిరుగుతూ గ్రామంలో రెక్కీ నిర్వహించారు. ఈ నెల 9న రాత్రి కందుకూరు సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్ తల్లి దేవరశెట్టి సుమతమ్మ ఇంట్లో ఒక్కరే నిద్రించారు. దుండగులు సుమతమ్మ ఇంటి తలుపు తట్టి.. 'అమ్మా బ్యానర్ కావాలి'. అని పిలిచారు. వచ్చింది తన కొడుకని భావించిన సుమతమ్మ తలుపు తీయగానే దుండగులు ఆమె ముక్కు నోరు మూసి మెడలోని 2తులాల బంగారు మంగళసూత్రం, చేతికున్న నాలుగు బంగారు గాజులను లాక్కున్నారు. తలుపు మూసి దుండగులు కారులో పరారయ్యారు. సుమతమ్మ అరుపులతో తేటివారు లేచి డయల్ 100కు కాల్ చేశారు. వెంటనే ఏసీపీ, సీఐ, ఎస్సై తేజంరెడ్డి అక్కడికి చేరుకొని పరిశీలించారు. ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల, యాచారం, నగర శివారు ప్రాంతాల పోలీసులను అప్రమత్తం చేశారు. సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. దుండగులు నంబర్ ప్లేట్ లేని కారులో వచ్చినట్లు, ఆ కారును అద్దెకు తీసుకున్నట్లు విచారణలో పోలీసులు నిర్ధారించుకున్నారు.సోమవారం రాత్రి మేడిపల్లి చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేస్తుండగా కారులో ప్రభాస్, శివ ఉన్నారు. అనుమానాస్పదంగా కన్పించిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. ఆకులమైలారంలో దోపిడీ చేసింది తామేనని ఒప్పుకున్నారు. నిందితుల నుంచి ఆరు తులాల బంగారు ఆభరణాలు, బలేనో కారు, ఓ మొబైల్ ఫోన్, కత్తెరను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చోరీ కేసును ఛేదించిన సీఐ, ఎస్సైలను, యాచారం, ఆదిభట్ల, హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ క్రైం పార్టీ సిబ్బందిని ఏసీపీ రివార్డుతో అభినందించారు.

హోటల్‌లో బిల్లు చెల్లించకుండా బెదిరించిన వ్యక్తి అరెస్టు

చేవెళ్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బిల్లు చెల్లించకుండా హోటల్ యజమానిని చంపుతానంటూ బెదిరించిన వ్యక్తిని చేవెళ్ల పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్ మండలం మిద్దెంగూడకు చెందిన బుర్ర రాములు చేవెళ్లలో ఓ చికెన్ షాపులో పనిచేస్తున్నాడు. ఈ నెల 14న రాత్రి చికెన్ షాపు ఎదురుగా ఉన్న ఫుడ్‌కోర్టు హోటల్‌కు వెళ్లి బిర్యాని టోకెన్ అడిగాడు. గతంలో బాకీ ఉన్న డబ్బు ఇవ్వాలని హోటల్ యజమని ఇర్ఫాన్ కోరాడు. టోకెన్ ఉద్దెర ఇవ్వనన్నాడు. దీంతో ఇర్ఫాన్‌తో రాములు గొడవపడ్డాడు. తనకు బిర్యానీ పెట్టకుంటే చంపేస్తానని రాములు బెదిరించాడు. దీంతో ఇర్ఫాన్ పోలీసులకు ఫోన్ చేశాడు. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి అక్కడికి చేరుకుని విచారణ చేశారు. రాములను అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

కల్లు డబ్బుల విషయంలో గొడవపడిన వ్యక్తి రిమాండ్

చేవెళ్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కల్లు దుకాణంలో డబ్బు చెల్లింపు విషయంలో గొడపడిన వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించిన సంఘటన కుమ్మెరలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బండ్లగూడ మున్సిపాలిటీకి చెందిన బుర్రు సత్తయ్యగౌడ్ కుమ్మెరలో కల్లుదుకాణం నడుపుతున్నాడు. ఈ నెల 14న గ్రామానికి చెందిన చాకలి కోటేష్ కల్లు దుకాణానికి వచ్చి కల్లు తాగాడు. అనంతరం డబ్బులివ్వగా చిల్లర డబ్బులు సత్తయ్యగౌడ్ ఇచ్చేశాడు. తనకు తిరిగి రావాల్సిన డబ్బులు ఇవ్వలేదని కోటేష్ గొడవపడి కల్లు సీసాను పగులగొట్టి సత్యయ్యగౌడ్ తలపై, చేతిపై కొట్టి గాయపర్చాడు. అక్కడే ఉన్న నరేష్, కుమార్‌లు గొడవను ఆపి గాయాలైన సత్తయ్యగౌడ్‌ను చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేసి కోటేష్‌ను అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

పశువుల దొంగల అరెస్ట్

షాద్‌నగర్ రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ ప్రాంత గ్రామాల్లో పొలాల వద్ద కట్టేసిన పశువులను దొంగిలించిన ఇద్దరు దొంగలను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. షాద్‌నగర్ పీఎస్ పరిధి గంట్లవెల్లికి చెందిన నందిగామ శ్రీధర్(32), వడ్ల శివకుమార్(20)లు పశువులను దొంగిలించేవారని తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం ఎల్లంపల్లి, వెలిజర్ల, కేశంపేట మండలం వేముల్‌నర్వ గ్రామాల్లో పశువుల అపహరించారన్నారు. వెలిజర్లకు చెందిన రాఘవేందర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేసి ఇద్దరు నిందితుల ను గుర్తించి అరెస్ట్ చేశామని, నిందితుల నుంచి మూడు ఆవులు, లేగదూడ, టాటాఏస్ వాహనం, ఓ బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

డీజే వాడిన వ్యక్తులపై కేసు

మాడ్గుల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో దుర్గామాత ఉత్సవాల్లో నిబంధనలు ఉల్లంఘించి డీజే వాడిన మండపాల నిర్వాహకులు, డీజే ఆపరేటర్లపై కేసులు నమోదు చేశామని సీఐ జగదీష్ మంగళవారం తెలిపారు. సోమవారం రాత్రి ఇర్విన్, మాడ్గుల, ఆర్కపల్లి గ్రామాల్లో దుర్గామాత మండలపాల వద్ద డీజే పెట్టారన్నారు. అనుమతి లేకుండా డీజేలు ఉపయోగించే వారిపై చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

15 కాటన్ల బీర్లు స్వాధీనం

యాచారం, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): బెల్టు షాపునకు తరలిస్తున్న 15కాటన్ల బీరు సీసాలను స్వాధీనం చేసుకున్నామని మంగళవారం పోలీసులు తెలిపారు. నందివనపర్తికి చెందిన పంబాల బిక్షం, ముక్తాల లింగం బెల్టు దుకాణానికి ఆటోలో బీర్ కాటన్లను తరలిస్తున్నట్లు సమాచారమొచ్చిందన్నారు. మొగుళ్లవంపు వద్ద తనిఖీ చేసి బీరు సీసాలు, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. అలాగే లింగం, బిక్షంలను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

చోరీకి గురైన సెల్‌ఫోన్ రికవరీ

కేశంపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అపహరణకు గురైన సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు మంగళవారం యజమానికి అందజేశారు. సీఐ నరహరి తెలిపిన వివరాల ప్రకారం.. నిర్దవెల్లికి చెందిన బద్క మహేష్ సెల్‌ఫోన్‌ను ఎవరో దొంగిలించారు. మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌తో సెల్‌ఫోన్‌ను గుర్తించారు. ఈ మేరకు ఫోన్‌ను స్వాధీనం చేసుకొని యజమానికి అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు : ఎస్సై

తలకొండపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని తలకొండపల్లి ఎస్సై శ్రీకాంత్ హెచ్చరించారు. టూ వీలర్లు విధిగా హెల్మెట్, కారు డ్రైవర్లు సీటు బెల్టు ధరించాలన్నారు. తలకొండపల్లిలో మంగళవారం ఆయన వాహనాలతనిఖీ చేపట్టారు. లైసెన్స్ లేని వారికి, హెల్మెట్, సీటు బెల్టు ధరించని వారిపై, మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేశారు. డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు చేపడుతున్న చర్యలకు వాహనాదారులు, ప్రజలు సహకరించాలన్నారు.

ఆపదలో ఉన్న వారికి సాయమందించాలి


కుటుంబీకులతో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా నాయకుడు ఎం.వైభవ్‌రెడ్డి తదితరులు

చేవెళ్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి ఆర్థిక సాయం చేస్తే ఆ కుటుంబానికి ధైర్యం కలుగుతుందని బీజేపీ జిల్లా యువ నాయకుడు మల్గారి వైభవ్‌రెడ్డి అన్నారు. రెండు రోజుల క్రితం మీర్జాగూడకు చెందిన జగ్గళ్ల కుమార్ బైక్‌పైనుంచి పడి గాయాలతో నగరంలోని ఓ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడు. మంగళవారం వైభవ్‌రెడ్డి, బీజేపీ నాయకులు కుమార్‌ను పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో దేవుని ఎర్రవల్లి మాజీసర్పంచ్ మాణిక్యరెడ్డి, బీజేపీ నాయకులు ఉన్నారు.

ఘనంగా టూ వీలర్స్ అసోసియేషన్ వార్షికోత్సవాలు


వేడుకలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్, అక్టోబర్ 15: శంషాబాద్ పట్టణంలో మంగళవారం రాత్రి మండల టూ వీలర్స్ అసోసియేషన్ పదో వార్షికోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. వేడుకలను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ ప్రారంభించారు. మెకానిక్‌లకు ఎలాంటి సమస్యలు వచ్చినా అర్థం చేసుకొని సహకరిస్తున్నామని అసోసియేషన్ నాయకులు అన్నారు. కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను సత్కరించారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా కాసుల వెంకటేష్‌గౌడ్, వైస్‌ప్రెసిడెంట్ షఫీక్, ప్రధాన కార్యదర్శి బి.మహేందర్ ఎన్నికయ్యారు. వారిని సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గణేశ్‌గుప్తా, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి


చేవెళ్లలో పశువులకు టీకాలు వేస్తున్న వెటర్నరీ వైద్యురాలు శిరీష

చేవెళ్ల/మాడ్గుల/శంకర్‌పల్లి/కొత్తూర్/ఆమనగల్లు,అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పక వేయించాలని చేవెళ్ల మండల పశువైద్యాధికారి శిరీష అన్నారు. గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని మంగళారం పలుగుట్టలో ఆమె ప్రారంభించారు. వచ్చే నెల 14వ తేదీ అన్ని గ్రామాల్లో పశువులకు టీకాలు వేస్తామని తెలిపారు. మాడ్గుల మండలంలోని అన్ని గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని వెటర్నరీ డాక్టర్ శ్రీకర్ రెడ్డి తెలిపారు. గాలికుంటు సోకిన పశువులకు నోట్లో, గిట్టల్లో పుండ్లు అయి జ్వరంతో మేత మేయవని, పాడి పశువుల్లో పాల దిగుబడి తగ్గుతుందని, అలాగే ఎడ్లు,దున్నపోతులు మేత మేయక అనారోగ్యంతో చివరకు చనిపోతాయని తెలిపారు. రైతులు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పక వేయించాలన్నారు. శంకర్‌పల్లి పశువైద్యాధికారి మానసరెడ్డి శంకర్‌పల్లిలో పశువులకు టీకాలు వేశారు. అనారోగ్యం బారిన పడిన పశువులను రైతులు తమ వద్దకు తీసుకువస్తే వైద్యం చేస్తామన్నారు. గాలికుంటు నివారణ టీకాల పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కొత్తూర్ మండల పశువైద్యాధికారి స్ఫూర్తి అన్నారు.పెంజర్ల, తిమ్మాపూర్ గ్రామాల్లో స్ఫూర్తి ఆధ్వర్యంలో సిబ్బంది 450 పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది కృష్ణ, జ్యోతి, రవి, రాజ్‌కుమార్, గోపాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు. ఆమనగల్లు మున్సిపల్ పరిధిలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. వెటర్నరీ డాక్టర్ అగ్నివేశ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సిబ్బంది రెండు టీంలుగా పశువుకు టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సులేమాన్, యాదయ్య, బురానోద్దీన్, పాలాక్ష, గోపాలమిత్రలు హరీశ్, రమేశ్, ప్రకాశ్ ఉన్నారు.


కొత్తూర్ : పెంజర్లలో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి స్ఫూర్తి


ఆమనగల్లు : పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్న డాక్టర్ అగ్నివేశ్



మాడ్గుల : పశువులకు టీకాలు వేస్తున్న మండల పశువైద్యాధికారి శ్రీకర్‌రెడ్డి



శంకర్‌పల్లి: గేదెలను పరిశీలిస్తున్న మండల పశువైద్యాధికారి మానసరెడ్డి

బీజేపీని తిరుగులేని శక్తిగా తయారు చేయాలి

మహేశ్వరం/కేశంపేట/షాద్‌నగర్ రూరల్/షాబాద్/తలకొండపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీని తిరుగులేని శక్తిగా తయారు చేయాలని, మహేశ్వరం నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభిస్తోందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. మంగళవారం గట్టుపల్లిలో బీజేపీ సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొని మాట్లాడారు. మహేశ్వరంలో పార్టీని బలంగా తయారు చేసేందుకు నాయకులు, కార్యక్తలు మరింత కష్టపడి సభ్యత్వాలను పెంచాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై ఇతర పార్టీల కార్యకర్తలు తరలి రావడంతో పాటు ప్రజలుసైతం సభ్యత్వాలు తీసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పోతర్ల సుదర్శన్ యాదవ్, శ్రీనివాస్, శ్రీశైలం, శివ, సత్యనారాయణ, నరేష్, మల్లేష్, రమేష్ పాల్గొన్నారు. బీజేపీతో దేశంలో సుస్థిర పాలన సాగుతోందని, ప్రధాని మోదీ హయాంలో దేశం ఆర్థిక వృద్ధి సాధించిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య అన్నారు. కేశంపేటలో పార్టీ మండలాధ్యక్షుడు రొల్ల రామురాములుగౌడ్ నేతృత్వంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ముఖ్య అతిథి బాబయ్య మాట్లాడారు. బీజేపీ సభ్యత్వం తీసుకునేందుకు యువత ఉత్సాహం చూపుతున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటుతుదని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం అధికార ప్రతినిధి శివాజీ, సభ్యత్వ నమోదు కన్వీనర్ కర్రెడ్ల నరేందర్‌రెడ్డి, కృష్ణయ్య, యుగేందర్ పాల్గొన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదుకు మంచి స్పందన వస్తోందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేష్‌గుప్తా అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం రంగంపల్లిలో సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో పాపయ్య పాల్గొన్నారు. దేశ ప్రగతి బీజేపీతోనే సాధ్యం అని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి మహేందర్ అన్నారు. షాబాద్ మండలం హైతాబాద్‌లో సభ్యత్వ నమోదులో పాల్గొని మాట్లాడారు. పీఎం నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి సాధిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను తుంగలో తొక్కిందన్నారు. ప్రతీ పల్లెలో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషిచేయాలన్నారు. బీజేపీ మండల దళితమోర్చా అధ్యక్షుడు మహేందర్, బూత్ అధ్యక్షులు రాఘవేందర్, నవీన్, నాయకులు శ్రీనివాస్, హరికృష్ణ, శ్రీను పాల్గొన్నారు. బీజేపీతోనే దేశ ప్రగతి, భద్రత సాధ్యం అని బీజేవైఎం కల్వకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పద్మఅనిల్ అన్నారు. తలకొండపల్లిలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజాసమస్యలపై బీజేపీ నిరంతరం ప్రజల పక్షాన పోరాటాలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


గట్టుపల్లిలో బీజేపీ సభ్యత్వ నమోదులో పాల్గొన్న శ్రీరాములుయాదవ్


షాబాద్: సభ్యత్వ నమోదులో పాల్గొన్న బీజేపీ, బీజేవైఎం జిల్లా నాయకులు శ్రీధర్‌రెడ్డి, మహేందర్


కేశంపేటలో సభ్యత్వం ఇస్తున్న బాబయ్య

తహసీల్దార్‌కు దసరా శుభాకాంక్షలు

శంషాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దగోల్కొండ గ్రామ కాంగ్రెస్ నాయకులు మంగళవారం తహసీల్దార్ రవీందర్ దత్తును కలసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యాలయంలో అధికారికి శాలువా కప్పి సత్కరించారు. సన్మానించిన వారిలో నాయకులు శ్రీధర్‌గౌడ్, శ్రీకాంత్, చిరంజీవి, మధు ఉన్నారు.


అధికారిని సత్కరించి మెమొంటో అందజేస్తున్న నాయకులు